క్లుప్తంగా

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజరు కరీమున్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో సంబంధిత ఆర్టీసీ అధికారులు బృందం పాల్గొంటారన్నారు. ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ విలువైన సలహాలు, సూచనలను, సెల్ 99592 25645 ద్వారా తెలియజేయాలని కోరారు.

పందిళ్లపల్లి పదవీ కాలం పొడిగింపు


పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి

సంగం: సంగం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ చైర్మన్ పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో సొసైటీ చైర్మన్‌గా పదవీ కాలాన్ని పొడిగించారని, తనపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు సేవలు అందిస్తానన్నారు. నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నాక్ కేంద్రం పరిశీలన


శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి అప్పారావు

ఉదయగిరి: పట్టణంలోని నాక్ కేంద్రాన్ని గురువారం జిల్లా శిక్షణాధికారి బి.అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద వివిధ చేతి వృత్తులు చేసుకునే వారికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా వృత్తిలో నైపుణ్యం మెరుగు పరచుకుని ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాత ఐకేపీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

ఉదయగిరి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న పాత ఇందిర క్రాంతి పథం భవనంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కార్యాలయంలోని పాత సామగ్రి దగ్ధమైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజరు శ్రీనివాసరావు

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ఉదయగిరి–సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల్లో ప్రయాణికుల ఆదరణ పొందేందుకు లక్కీ డ్రా నిర్వహించినట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జనవరిలో సీతారామపురం మార్గంలో తిరిగిన ఆర్టీసీ బస్సుల్లో లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేశామని, ఆ బాక్సుల్లో వేసిన ప్రయాణికుల టికెట్ల ఆధారంగా మహేష్, ఝాన్సీరాణిలను విజేతలుగా ఎంపిక చేశామన్నారు. వారికి బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగభూషణం, వెంకటేశ్వర్లు, సలాం, కార్మికులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ నెహ్రూబాబు తనిఖీ చేశారు. ఆయన పట్టణంలోని జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 45 నుంచి 60 పోలింగ్ కేంద్రాలు, గంగిరెడ్డిపల్లి, గుడినరవ, వెంగళరావునగర్, గండిపాళెం కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో వసతులు చూసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. బీఎల్వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి డీవార్మింగ్

ఉదయగిరి: మండలంలో శుక్రవారం నుంచి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి ఎం.శివకల్పన తెలిపారు. ప్రతి పాఠశాల విద్యార్థికి డీవార్మింగ్ మాత్రలు అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సంక్షేమం.. మారిన జీవనం

తగ్గుతున్న పేదరికం
- పెరుగుతున్న పొదుపు
- మెరుగు పడిన ఆర్థిక పరిపుష్టి



సోమశిల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సాక్షాత్కరిస్తోంది. గడిచిన ఐదేళ్లలో గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. పేదరికాన్ని అధిగమించి దిగువ మధ్య తరగతి స్థాయికి ఎదిగారు. మహిళలను ఆర్థికంగా బలవంతులను చేసేందుకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పలు కుటుంబాల్లోని మహిళలు సొంత వ్యాపారాలు చేసుకుంటూ తమ వంతుగా కుటుంబాలను పోషిస్తూ జీవన ముఖ చిత్రాలను మార్చుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు గ్రూపులో సభ్యులుగా ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం చేస్తానన్న రుణమాఫీ చేయకపోవడం, చిన్నపాటి వ్యాపారానికి ఆర్థిక తోడ్పాటు అందించకపోవడంతో మహిళల జీవనశైలిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. పొదుపు ద్వారా తీసుకున్న రుణం, దానికి అయ్యే వడ్డీ అదనం, వ్యాపార నిర్వహణ కోసం చేసిన అప్పులు ఇలా సొంత వ్యాపారాలు చేసుకుని పైకి రావాలనుకునే మహిళలకు అడ్డంకులు అనేకం ఉండేవి. ఇలాంటి పరిస్థితిల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన సంక్షేమ పథకాలతో పాటు ఆర్థిక తోడ్పాటు అందించడంతో చిన్నపాటి వ్యాపారాలను ప్రారంభించుకుని తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను సైతం పోషించే స్థాయికి ఎదిగారు. నాలుగేళ్ల పాటు అందుకున్న సంక్షేమ పథకాలకు తోడు ప్రభుత్వం ఇస్తున్న రుణ సహాయంతో వ్యాపార ఖర్చులు, రుణాల చెల్లింపులు పోను ఆదాయం పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు నెలకు సగటున నెలకు రూ.10 వేలకు పైగా మిగులు ఆదాయంతో బ్యాంక్‌ల్లో పొదుపు చేసుకుంటున్నట్లు ఇటీవల బ్యాంకర్లు ప్రకటించిన లెక్కలే తేల్చుతున్నాయి. ఇదే పరిస్థితి మరి కొన్నేళ్లు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నామమాత్రంగా ఉంటుందని గ్రామీణ మహిళలు చెబుతున్నారు.


కిరాణా దుకాణం నిర్వహిస్తున్న చెన్నమ్మ

కిరాణా దుకాణంతో నెలకు రూ.12 వేలు ఆదాయం

గతంలో నేను రోజు కూలి పనికి వెళ్లి కుటుంబానికి నా వంతుగా సహాయ సహకారాలు అందించేదానిని. పొదుపు గ్రూపులో చేరినా వచ్చిన రుణాన్ని ఇంటి అవసరాలకు వాడుకునే వాళ్లం. ప్రతి నెల పొదుపు కట్టుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. గతంలో పొదుపు రుణాన్ని మాఫీ చేశారు. కొత్తగా పొదుపులో రూ.50 వేలు రుణ సహాయంతో చిన్న కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాను. ఉన్నతి పథకం ద్వారా మరో రూ.50 వేలు తీసుకుని వ్యాపారాన్ని మరింత విస్తరించాను. ఆదాయం వస్తుండడంతో నా భర్త సహకారంతో ఇల్లు కూడా కట్టుకున్నాం. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.50,224 అందాయి. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.10 వేలు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.75 వేలు, పొదుపు గ్రూపుల ద్వారా రూ.లక్ష, ఉన్నతి పథకం ద్వారా రూ.50 వేలు ఇలా ప్రభుత్వం నాకు రూ.2,85,224 వరకు అందజేసింది. ఇంటి ఖర్చులు, బ్యాంకు లింకేజీ ఉన్నతి రుణం కట్టిన తర్వాత కూడా నెలకు రూ.12 వేలు ఆదాయం మిగులుతోంది. ఇదంతా పొదుపు చేసుకోగలుతున్నాను. ఇలా మా ఆర్థికాభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎస్ చెన్నమ్మ, లింగంగుంట

10లో నూరుశాతం ఫలితాలకు కృషి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రఘురామయ్య

సంగం: ఈ ఏడాది మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని డిప్యూటీ డీఈఓ రఘురామయ్య తెలిపారు. సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత పెంపుపై ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేస్తున్నామన్నారు. విద్యార్థులు రాత్రి సమయంలో ఎలా చదువుతున్నారనే విషయాలపై వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారని, అవసరమైన సలహాలు ఇస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం, ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

ఉదయగిరి: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని బీజేపీ నేత రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు నూరు శాతం రాయితీతో బస్‌పాస్‌లు, రూ.10 వేలు పింఛన్ సౌకర్యం, ట్రైసైకిళ్లు, అంత్యోదయ బియ్యం కార్డులు అందేలా చూస్తానన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. తన సొంత నిధులతో దివ్యాంగులకు అన్ని విధాలా ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘ నాయకులు ఆదోని రమణయ్య, ఏ రాజా, బీజేపీ నాయకులు సయ్యద్ షాజహాన్, రోశయ్య, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


గండ్లవేడు వద్ద నూతన రహదారి నిర్మాణానికి భూమి చదును చేస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి డీసీపల్లి మీదుగా వెన్నవాడ–గండ్లవేడు, వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు నిర్మించనున్న నూతన రహదారి నిర్మాణ పనులను గురువారం వైఎంఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రారంభించింది. రూ.9.5 కోట్ల వ్యయంతో బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణం ద్వారా అనుసంధానం చేస్తూ ఈ పనులకు గత నెల 21న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి భూమి పూజ నిర్వహించిన విషయం తెలిసిందే. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని నాలుగు మండలాలు, 40 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువైన ఈ మార్గం కావడంతో మేకపాటి సోదరులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పడకండ్ల, వెన్నవాడ గ్రామ పంచాయతీల వైఎస్సార్‌సీపీ నేతలు కొల్లి దొరస్వామినాయుడు, జగన్నాథం ప్రసాద్, దిశించర్ల ప్రసాద్, పాశం లింగయ్య నాయుడు, శ్రీహరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


కుడుములదిన్నెపాడు శ్మశానంలో బోరు ఏర్పాటు

కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో పంచాయతీలో పూర్తిస్థాయిలో మౌలిక కల్పనకు కృషి చేస్తామని సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ కుడుములదిన్నెపాడులోని శ్మశానంలో కంప చెట్లను తొలగించి గురువారం బోరు నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తన్నీరు అంకమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మబ్బు శ్రీనివాసులు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ స్వప్నిల్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో వాహనదారులకు రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంవీఐ స్వప్నిల్‌రెడ్డి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు వైద్యసాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సాయం అందించిన వారికి పారితోషకంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రఘువర్ధన్‌రెడ్డి, డాక్టర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శివనాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఆత్మకూరురూరల్: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శివనాగిరెడ్డి ఆత్మకూరు తహసీల్దారుగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీటీ, ఆర్‌ఐ పృథ్వీకుమార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులపై ఫీజుల ఒత్తిడిని నియంత్రించండి


ఆర్డీఓ కార్యాలయ డీటీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు: ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులపై యాజమాన్యాలు ఫీజులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నార ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పేర్కొన్నారు. హాల్ టికెట్లు సైతం ఇవ్వబోమని బెదిరిస్తుండడంతో విద్యార్థులు అగమ్యగోచరంలో ఉన్నారన్నారు. పట్టణంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాలల ఫీజుల డిమాండ్ నియంత్రణ కోరుతూ విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా, చక్రి, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఉదయగిరి: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నెహ్రూబాబును గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మెట్ట ప్రాంత ప్రజలు, రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, నాయకులు ఎం అక్కుల్‌రెడ్డి, జి.శ్రీనివాసులు రెడ్డి, యు.హరి, యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెల్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

కలిగిరి: మండలంలోని తెల్లపాడు గ్రామసచివాలయం పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి బి. గీతారెడ్డి గురువారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగంగా పూర్తి చేయండి


చేజర్ల: జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ


సంగం: ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లపై సూచనలు చేస్తున్న ఆర్డీఓ మధులత

- ఆర్డీఓ కే మధులత

చేజర్ల: జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పెరుమాళ్లపాడు సచివాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో ఆధ్వర్యంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైతే ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ ఎస్ కరిముల్లా, ఆర్‌ఐ సుమతి, పంచాయతీ సెక్రటరీ చిరమన సందీప్, వీఆర్వో పావని పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

సంగం: సంగంలోని స్థానిక సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆత్మకూరు ఆర్డీఓ మధులత గురువారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. పల్లిపాళెంలో ఇటీవల స్లాబ్ పెచ్చులూడిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. తహసీల్దారు రమాదేవి స్థానిక జెడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రంలో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజనారాయణ, వీఆర్‌ఓలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


సోమశిల: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల పరిశీలన

సోమశిల: అనంతసాగరం సచివాలయం–1లో జరుగుతున్న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్ నరసింహారావు గురువారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలను పంచాయతీ కార్యదర్శి మోహన్‌కిషోర్, వీఆర్వో బాబును అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో 165 ఇళ్లు మంజూరయ్యాయని, 75 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తహసీల్దార్‌కు వివరించారు. ఆన్‌లైన్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతుందని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. లోపాలుంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సూచించారు.

కావలి కాలువకు నీరు విడుదల


కొత్తపాళెం వద్ద జలదంకి మండలానికి సాగు నీరు విడుదల చేసిస్తున్న మాలకొండారెడ్డి, అధికారులు

జలదంకి: కావలి కాలువ ద్వారా మండలంలోని కొత్తపాళెం వద్ద గేట్లు ఎత్తి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, అధికారులతో కలిసి దిగువ ప్రాంతానికి గురువారం నీరు విడుదల చేశారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా రెండు నెలల నుంచి నీరు విడుదల విషయమై ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి కావలి కాలువకు ఇప్పుడు ఇస్తున్న నీటికి అదనంగా 1.5 టీఎంసీల నీరు అందించేందుకు ఆమోదం తీసుకువచ్చారన్నారు. కావలి కాలువ పరిధిలో ఉన్న మండలంలోని ప్రతి రైతును ఆదుకుంటామ చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మినేని సతీష్‌నాయుడు, వేలమూరి శ్రీధర్‌రెడ్డి, సోమశిల ఈఈ రమణారెడ్డి, కావలి కాలువ ఏఈ రామారావు, రైతులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు స్వల్ప అస్వస్థత

ఉదయగిరి: మండల కేంద్రమైన ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. ఇక్కడ చదివే కొందరు కళాశాల ప్రాంగణంలోని హాస్టల్లో ఉంటున్నారు. మూడురోజులుగా సుమారు 30 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స పొందారని వైద్యాధికారిణి అనీషా గురువారం తెలిపారు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చామన్నారు. కలుషిత ఆహారం తినడం వల్ల ఇలా జరిగి ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ విషయమై కళాశాల డీన్ టి.గోపీకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయండి


తరగతి గదిని పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

అనుమసముద్రంపేట: త్వరలో 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలని తహశీల్దారు రవికుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, విద్యాశాఖాధికారి సాయిప్రసాద్ తెలిపారు. గురువారం ఏఎస్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలను పరిశీలించారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 120 మంది, ఏపీ మోడల్ పాఠశాలలో 170 మంది విద్యార్థులకు సరిపడా టేబుల్స్, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులను వసతి అడిగి తెలుసుకున్నారు.

సైడ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం


సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, నాయకులు

సోమశిల: మండలంలోని కమ్మవారిపల్లిలో రూ.15 లక్షలతో సైడ్ డ్రెయినేజీ పనులను గురువారం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుల శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు కోరారు. దీంతో రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన పీహెచ్‌సీ పరిధిలోని గుంపర్లపాడులో వైద్య సిబ్బంది గురువారం ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. డాక్టర్ జ్యోతిరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. గ్రామంలో దాదాపు 315 ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు 407 మంది ఆయుష్మాన్ కార్డులను అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఖాదర్ బాషా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.